❖•❖•❖ 59 ❖•❖•❖

# యేసు అంత్యక్రియలు

*"అటుతరువాత యూదుల భయమువలన రహస్యముగా యేసు శిష్యుడైన అరిమతయియ యోసేపు, తాను యేసు దేహమును తీసికొనిపోవుటకు పిలాతునొద్ద సెలవడిగెను; పిలాతు సెలవిచ్చెను. గనుక అతడు వచ్చి యేసు దేహమును తీసికొనిపోయెను. మొదట రాత్రివేళ, ఆయన యొద్దకు వచ్చిన నీకొదేము కూడ, బోళముతో కలిపిన అగరు రమారమి నూట ఏబది సేర్ల యెత్తు తెచ్చెను. అంతట వారు యేసు దేహమును ఎత్తికొనివచ్చి, యూదులు పాతిపెట్టు మర్యాద చొప్పున ఆ సుగంధద్రవ్యములు దానికి పూసి నారబట్టలు చుట్టిరి. ఆయనను సిలువవేసిన స్థలములో ఒక తోట యుండెను, ఆ తోటలో ఎవడును ఎప్పుడును ఉంచబడని క్రొత్త సమాధి యొకటి యుండెను. ఆ సమాధి సమీపములో ఉండెను గనుక ఆ దినము యూదులు సిద్ధపరచు దినమైనందున వారు అందులో యేసును పెట్టిరి" (యోహాను 19:38-42).*

మనమందరము, దేవుని కుమారుడు సిలువపై మరణించుటను చిత్రీకరించుకొనుటకు కష్టపడుదుమని నేను నమ్ముదును. పైపెచ్చు, ఆయన దేహము పాతిపెట్టబడుట గూర్చి ఊహించుకొనుట కూడా అంతే కష్టమైన అంశం. అట్లయినప్పటికిని ఆయన మరణము మరియు ఆయన పాతిపెట్టబడుట ఆయన శరీరధారియైన దేవుని కుమారుడుగా ఇహమునకేతెంచిన ఆగమనముతో సంబంధము కలిగియున్నవి. ఆయన మన పాపములకు బల్యర్పణయగుటకు వచ్చాడు మరియు ఆయన మన నిమిత్తము తనను తాను అప్పగించుకొన్నాడు గనుక ఆయన సిలువపై తనను తాను చంపుకొని పాతిపెట్టబడుటకు అనుమతించవలసిన అవసరం ఏర్పడింది. ఆశ్చర్యకరమైన విషయమేమనగా, ఆయన దేహము పాతిపెట్టబడవలసిన కార్యమంతటిని ఆయనను వెంబడించుచుండిన వారికి ఆయన వదిలిపెట్టాడు.

యేసు ఈ లోకమునకు వచ్చుట దాని గూర్చి ఏ వ్యక్తియైనను లేదా ప్రజా సమూహమైనను ఎప్పుడైనా నూతనంగా కనిపెట్టని గుణగణాలు కలిగియుండినదని సంభవించిన ఈ సంఘటనలు మనకు గుర్తుచేయుచున్నవి. దేవుని కుమారుడు, మహోన్నతుడైనవాడు, రాజుల రాజు, ప్రభువుల ప్రభువు, పట్టబడి, తీర్పుతీర్చబడి, కొట్టబడి, క్రూరంగా చంపబడి, బహిరంగముగా ఎవరిచేతనైనా ఎచ్చోటనైనా పారవేయబడుటకు ఒక సిలువ మీద వ్రేలాడబడి యుండనట్లు వదిలిపెట్టబడ్డాడు! దీనిని ఎవరైనా ఊహించుకొన్నారా, ఊహించుకొని జీర్ణించుకోగలిగారా?

యేసు తన ఆత్మను శుక్రవారం సంధ్యవేళప్పుడు దేవునికి అప్పగించుకొన్నాడు, సూర్యదస్తమించుటకు ఎక్కువ సమయం లేదు. "... సాయంకాలమైనప్పుడు" అని మార్కు వ్రాయుచున్నాడు (మార్కు 15:43). బహుశ అది మునిచీకటికి ముందటి ఒక గంట సమయమైయుండవచ్చును. సైనికులు ఆ ఇద్దరు దొంగల దేహములను క్రిందికి దింపి అమానుషమైన తీరులో ఏదో ఒక విధముగా వాటిని ఒక గుంటలోనికి గాని లేదా ఎవరూ గుర్తించుకొనని సమాధిలోనికి పారవేసియుందురు. సౌహార్ద్యహృదయులైన సేవకులు శ్రద్ధ తీసికొనకుండ ఉండినట్లయితే యేసు దేహానికి కూడ అదే గతి పట్టేది.

భూస్థాపన కార్యక్రమాన్ని ఇద్దరు పురుషులు నిర్వహించారు: అరిమతయియ యోసేపు మరియు నీకొదేము. యోసేపు యేసు దేహమును ఎంతో భక్తిపూర్వకంగా సిలువ మీద నుండి క్రిందకు దింపాడని నాలుగు సువార్తలు చెప్పుచున్నవి; ఏదిఏమైనా, ప్రతి సువార్త దాని వర్ణనకు ఏదో కొంత ప్రత్యేక వివరమును చేర్చుచున్నది, సువార్తలలో యోసేపు పేరు పేర్కొనబడుట ఇదొక్కసారే. ఇంతమాత్రమేగాక, యోహాను మాత్రమే నీకొదేము వహించిన పాత్రను కలుపుచున్నాడు. ఆయన మిగిలిన ముగ్గురు సువార్తికులు చెప్పుచున్నదానికి అనుబంధంగా చేర్చుచున్నాడు.

వీరిద్దరు కూడ యేసునకు తీర్పుతీర్చబడి ఆయన సిలువవేయబడునట్లు బాధ్యత వహించిన, యూదుల మహా సభలో సభ్యులై యుండిరి (లూకా 23:50; యోహాను 3:1). బహుశ వారు ఈ మహా సభా సమావేశానికి రావలసినదని అధికారికంగా పిలువబడకపోయి యుండవచ్చును, లేదా, పిలువబడినను వీరు వెళ్లకపోయి యుండవచ్చును.

యోసేపు యెరూషలేములో ఒక గొప్ప ఆస్తిపరుడై యుండెను (మత్తయి 27:57; నొక్కి చెప్పింది నాది). ఆయన అరిమతయియ నివాసి, అది యూదా దేశంలోని పర్వప్రాంతంలో ఎక్కడో ఒక మారుమూలలో నున్న గ్రామము (లూకా 23:50). పిలాతు యొద్దకు వెళ్లి యేసు దేహమును పాతిపెట్టుటకు అనుమతినిమ్మని అడుగాలని ఆయన తీర్మానించుకున్నాడు. యేసు దేహం కొరకు ఆయన పిలాతును సమీపించినప్పుడు ఆయన యొక్క సిరిసంపదలు మరియు అధికార స్థాయి ఆయనకు పరపతి కల్పిస్తాయి. ఆయన "ఘనత వహించిన యొక సభ్యుడై, దేవుని రాజ్యము కొరకు ఎదురుచుచువాడు" అని మార్కు ఆయన గూర్చి వ్రాస్తున్నాడు (మార్కు 15:43బి). "అతడు సజ్జనుడును నీతిమంతుడునైయుండి (వారి ఆలోచనకును వారు చేసిన పనికిని సమ్మతింపనివాడు)" అని లూకా వ్రాస్తున్నాడు (లూకా 23:51ఎ). ఆయన ఒక శిష్యుడై యుండెను, కానీ యూదులకు భయపడి, ఆయన యేసు పట్ల కలిగియుండిన తన నిష్ఠను రహస్యంగా నిర్వర్తించాడు (మత్తయి 27:57; యోహాను 19:38).

"... (పిలాతు) యోసేపునకు ఆ శవము నప్పగించెను" అని మార్కు చెప్పుచున్నాడు (మార్కు 15:45), అనగా, యేసు దేహమును సిలువమీదనుండి దింపి పాతిపెట్టుటకు పిలాతు యోసేపుకు అనుమతినిచ్చాడు. యేసు దేహమును అప్పగింపక మునుపు అప్పటికి ఆయన మరణించాడో లేదో పిలాతు రూఢిపర్చుకొనవలసి యుండినది. "ఆయన ఇంతలోనే చనిపోయెనా అని ఆశ్చర్యపడి యొక శతాధిపతిని తన యొద్దకు పిలిపించి, ఆయన ఇంతలోనే చనిపోయెనా అని అతని నడిగెను. శతాధిపతివలన సంగతి తెలిసికొని, యోసేపునకు ఆ శవము నప్పగించెను" అని మార్కు వ్రాయుచున్నాడు (మార్కు 15:44, 45). యేసు అప్పటికే మరణించెనని తెలిసికొన్న పిలాతు నివ్వెరపోయాడు, కానీ యోసేపు మనవిని కాదనలేదు. వెంటనే యూదుల మహాసభ సభ్యుడైన యీయన సిలువ యొద్దకు వెళ్లి యేసు దేహమును క్రిందకు దింపాడు (లూకా 23:53).

యోహాను నీకొదేము గూర్చి వెవ్వేరు సందర్భములలో ముమ్మారు పేర్కొన్నాడు. నీకొదేము యేసు నొద్దకు రాత్రివేళ వెళ్లిన కథను వ్రాసాడు (యోహాను 3:1, 2). మరొకసారి, యేసును పట్టుకొనుటలో విఫలులైనవారి గూర్చి తిరస్కారముతో మాటలాడుటకు మొదలుపెట్టిన ప్రధాన యాజకులను మరియు పరిసయ్యులను ఆయన గర్పించుటకు సాహసించిన విషయాన్ని తెలియజేసిన సందర్భంలో పేర్కొన్నాడు (యోహాను 7:47–51). మూడవసారి, యేసు

పాతిపెట్టబడిన సందర్భములో యోహాను ఆయన పేరు పేర్కొన్నాడు. యేసు దేహమునకు పూయబడు నిమిత్తము ఆయన రమారమి నూట ఏబది సేర్ల యెత్తు బోళముతో కలిపిన అగరు తెచ్చి యోసేపుతో కూడ కలిసి ఆ పని చేశాడు.

అలాగైతే, యేసుకు ఎటువంటి అంత్యక్రియలు చేయబడినవి?

*మొట్టమొదటిగా, ఆయన అంత్యక్రియలు ముక్తసరుగా ఉండినవని మనము గమనించగలము.* యేసును గూర్చి ఏ మానవుడైనా వ్రాయగలిగి యుండిన కీర్తిగానం చదువడానికిగాని పాడటానికిగాని భూలోక నివాసులందరు సమాధి యొద్ద చేరియుందురని నీవనుకొనవచ్చును. కానీ అదేదీ జరుగలేదు, ఒక వేళ ఏదైనా ఒక కీర్తిగానం చేయబడి యున్నా, దాని గూర్చి మనకు తెలియజెప్పబడలేదు. వీరిద్దరు, బహుశ ఇతరుల సహాయంతో, యేసు దేహమును సమీపములోని యోసేపు దానంచేసిన సమాధి వరకు మోసికొనివెళ్లి యుందురు (మత్తయి 27:59, 60). వారు యేసు దేహమును బహుజాగ్రత్తగా నారబట్టతో చుట్టి, దాని మడతలలో తీసికొనివచ్చిన సుగంధద్రవ్యములను పోసి, దిట్టమైన రాతిలో తొలిపింపబడి యుండిన, సమాధిలో ఉంచారు. ప్రొద్దుగ్రుంకుటకు సమయము చాలా తక్కువగా ఉండినందువలనను యేసు మరణం విషయంలో ఆగ్రహావేశంతో కూడిన అమితానందోత్సాహము చెలరేగుచుండినందు వలనను వారు ఈ పనంతటిని చేయగలిగినంత త్వరత్వరగా చేసి ముగించారు. నిర్జీవ శరీరము గూర్చి గంభీరోపన్యాసము ఏదైనా చేయబడి యుంటే అది అతి సంక్షిప్తమైనదిగాను తొందరగా చేయబడినదై యుండును.

*ఇంకా, ఆయన అంత్యక్రియలకు కొద్ది మంది మాత్రమే వచ్చారు.* సమీపంగా ఉండినవారు ఈ ఇద్దరు పురుషులు, యోసేపు మరియు నీకొదేము, ఈ కార్యక్రమమంతటిని కొంచెం దూరంలో ఉండి చూచుచుండిన కొందరు స్రీలు, మనకు తెలిసినంత వరకు సమాధి యొద్ద అపొస్తలులు లేరు, యోహాను సహితము లేడు. మరణశయ్యపై నిద్రించుటకు మన ప్రభువైన యేసు తన తలను వంచినప్పుడు, కాళ్లు విరుగగొట్టనందువలన చావు కొడవలి దెబ్బకు ఇద్దరు దొంగలు చచ్చిపోయినప్పుడు, సిలువ చెంత చేరియుండిన ప్రేక్షకులంతా వారి వారి ఇళ్లకు తిరిగి వెళ్లిపోయారు. "ఆయన చచ్చిపోయాడుకదా? ఇంకా ఇక్కడనే ఉండి మనము చేసేదేమున్నది, వృథాయే కదా, వెళ్లిపోవడమే సుఖంకదా?" అని ఎవరి మనస్సులో వారు వాదించుకొనియుంటారు.

ఏదిఏమైనా, కొందరు వెళ్లలేకపోయారు. కారణం? యేసు దేహము సరియైన రీతిలో సమాధి చేయబడనంత వరకు యేసు యెడల వారికుండిన భక్తిశ్రద్ధలు వారి మనస్సుల్లో రేపిన ఆందోళన వారు వెళ్లి తమ తమ పనులు యథావిధిగా చేసికొనుటకు వారిననుమతించలేదు. ఒక యోసేపు బేత్లెహేములో పసిబిడ్డ దేహమును తన చేతులతో ఎత్తుకొని లాలిస్తూ ఆడించాడు, ఇప్పుడు మరొక యోసేపు యేసు దేహమును తన చేతులతో మోసికొని వెళ్లి యెరూషలేములోని సమాధిలో ఉంచుచున్నాడు. దేవుడు ఆయన పనుల నిమిత్తము ఎల్లప్పుడు మానవ హస్తములను వాడుకొన్నాడు. యేసు బోధించుచుండినప్పుడు ఆయన బోధలు విని ఆయన యందు విశ్వాసముంచిన స్త్రీలు ఆయన కొరకు మరేదియు చేయలేనంత వరకు వారు ఆయనతో కూడా ఉండిపోయారు. అన్ని యుగములలోను అతిశయోక్తికరమైన అంత్యక్రియలకు అత్యల్ప సంఖ్యాకులు అరుదెంచారు.

*మూడవదిగా, ఆయన అంత్యక్రియలు సుకుమారమైనవిగాను మనస్సును*

*ద్రవింపజేయునవిగాను ఉండెను.* ఔను, ఈ ఇద్దరు పురుషులు వారి విశ్వాసమును బహిరంగముగా కనుపర్చుటకు వారు ఎందుకు ఇంత కాలము వేచియుండిరో అని మనము ఆశ్చర్యపోదుము; సరిగదా ఆయనను ఎరిగియుండినవారును ఆయనతో కూడ ఉండినవారును ఎందుకంత సులభంగా, అంత శీఘ్రంగా, అక్కడ ఎక్కడా కనబడకుండా పూర్తిగా వెళ్లిపోయారే అని కూడ మనము అబ్బురపడుదుము. ఏదిఏమైనా, భక్తిభావము మరియు సాహసోపేతమైన విశ్వాసములో నుండి జనించిన సహానుభూతిని, సున్నితమైన శ్రద్ధను, మరియు ఆదరాభిమానములను మనము అక్షరాలా చూడగలము.

యోసేపు యూదుల పద్ధతి ప్రకారము చేశాడు; ఆయన "యేసు దేహమును తీసికొనిపోవుటకు" పిలాతు యొక్క సమ్మతము కొరకు సవినయంగా మనవి చేశాడు (యోహాను 19:38బి). వారు ముగ్గురి దేహములను "తీసివేయుటకు" అనుమతినిమ్మని పిలాతును అడిగారు (యోహాను 19:31బి). ఏదిఏమైనా, యోసేపు మనుష్యకుమారుని గౌరవించాలని ఆశిస్తూవుంటే, వారు సబ్బాతు కొరకు సిద్ధపడగలుగునట్లు ఆ దేహము వారి కంటికి కనబడకుండా తీసివేయబడితే చాలని యూదులు కోరుకొన్నారు, ఈ సమయంలో ఆయన యేసు స్నేహితుడని అందరికీ తెలిసిపోవుట అపాయకరమైన అంశమే అయియుండినప్పటికినీ యోసేపు యేసు దేహమును ఎలాగైనా పాతిపెట్టుటకే సిద్ధమయ్యాడు. "యూదులవలన" తన విశ్వాసాన్ని రహస్యంగా భద్రం చేసికొంటూ ఉండిన ఆయన (యోహాను 19:38బి), ఇప్పుడు, "తెగించి, పిలాతు నొద్దకు వెళ్లి యేసు దేహము (తనకిమ్మని) యడిగెను" (మార్కు 15:43బి).

"మొదట రాత్రివేళ ఆయన యొద్దకు వచ్చిన నీకొదేముకూడ బోళముతో కలిపిన అగరు, రమారమి నూట ఏబది సేర్ల యెత్తు తెచ్చెను" (యోహాను 19:39). పిలాతు అనుమతి కోసం వెళ్లాల్సిన పనిలో యోసేపు నిమగ్నమై యుండగా, నీకొదేము తన వంతుకు భాగ్యమని యెంచి సుగంధద్రవ్యములను సేకరించుటలో నిమగ్నమయ్యాడు. భక్తిభావములోను బల్యర్పణలోను ఆయన యథార్థమైన భాగస్వామి అయ్యాడు, ఏలయనగా ఆయన తెచ్చిన బోళముతో కలిపిన అగరు యేసు దేహము పాతిపెట్టబడు నిమిత్తము ఎంతో ఖరీదైన బహుమానమయ్యింది.

*నాల్గవదిగా, యేసు అంత్యక్రియలు చిరస్మరణీయమైన చిరంజీవిగా నిలిచిపోతాయి.* మన ప్రభువు ఆయన ఎలా పాతిపెట్టబడునో యని గాని, ఆయన సమాధి యొద్ద ఒక గంభీరోపన్యాసము చేయబడుతుందో లేదో యని గాని చింతించలేదు. ఇవన్నీ కూడ వాటంతట అవే వాటి గూర్చి శ్రద్ధ వహించి దేని పని అది సక్రమంగా చేస్తుందని ఆయన ఎరిగియుండెను. దేవుని ఆశ్చర్యకరమైన ఏర్పాటు చొప్పున యేసు పాతిపెట్టబడుట ఒక ప్రవచన నెరవేర్పయ్యింది. అది ఆయన పాతిపెట్టబడుటలో గోచరించు గౌరవము ఆయన మరణములో మరుగైయుండకపోవు అవమానమునకు నిశితమైన తారతమ్యముతో కూడినదై యుండునని ముందుగా తెలియజెప్పబడిన, లేఖనముల ప్రకారమైనదై యుండినది. "అతడు మరణమైనప్పుడు భక్తిహీనులతో అతనికి సమాధి నియమింపబడెను, ధనవంతుని యొద్ద అతడు ఉంచబడెను, నిశ్చయముగా అతడు అన్యాయమేమియు చేయలేదు, అతని నోట ఏ కపటమును లేదు" అని యెషయా ప్రవక్త రచించాడు (యెషయా 53:9).

యేసు మరణము ప్రపంచ చరిత్రలోనే అతి గొప్ప సంఘటనై యుండినది మరియు అది అతి గొప్ప సంఘటనగానే నిలిచి యుంటున్నది. దానికి సంబంధించిన ఏ విషయమైనా

యుగాంతము వరకు చదువబడుతుంది మరియు లోతుగా మననంచేయబడుతుంది. ఆ నాడు ఆయన అంత్యక్రియలకు హాజరైనవారు బహుకొద్ది మందే కావచ్చు, కానీ భూలోకమందలి జనసమూహములు లేఖనములలో చిత్రీకరింపబడిన దాని చిత్రమును చూస్తూ అలోచిస్తూ, మానవుల దుర్మార్గపు దుశ్చర్యల కన్నీరు కారుస్తూ చతకిలబడి కూర్చుండి పోతారు, కానీ యేసు ప్రేమను మరియు ఆయన జీవించిన ఆశ్చర్యకరమును, అవినాశమైన జీవితమును ఒక మహోత్సవంగా మారుమ్రోగిస్తారు.

❖◆❖◆❖

*నీ అంత్య క్రియల గూర్చి ఏమాత్రమైనను ఆలోచింపవద్దు; నీ ఆలోచనలను నీ జీవితముపై కేంద్రీకరించి నీవెలా జీవిస్తావో ఆలోచించుము. నీవు నీ జీవితమును సరైన రీతిలో జీవించినట్లయితే, నీ అంత్య క్రియలు వాటి గూర్చి అవే చింతిస్తాయి.*